# అందని వసంతం

లోకం మల్లెపూవులా విచ్చుకుంటోంది. ఆ వెలుగు దిగంతాలవరకు పరిమళంలా వ్యాపిస్తోంది. నిద్ర మేల్కొన్న జీవుల సందడి తుమ్మెదల రొదలా వినబడుతోంది.

మెలకువవచ్చిన మల్లిక వళ్ళువిరుచుకుని పట్టిమంచం దిగింది. కళ్లునులుముకుంటూ పెరటివైపు నడిచింది. బొగ్గుల కుంపటిదగ్గర కూర్చుని కాఫీ తయారుచేస్తోంది పెత్తల్లి. మల్లిని చూసి కుంపటి జోరుగా విసురుతూ "లేచావా మల్లీ! త్వరగా మొహంకడుక్కునిరా వేడివేడికాఫీ తాగుదువుగాని" అంది.

కళ్ళు నులుముకోడం మానేసి మల్లిపందిరినేచూస్తున్న మల్లికి ఆమాటలు వినబడలేదు.

"అలా నిలబడ్డావేమేమల్లీ! వెళ్ళి మొహం కడుక్కురా!" తిరిగి పెత్తల్లి చెప్పింది.

ఈసారి మల్లి పెత్తల్లివైపు చూసింది.

"చిటికెలో మొహం కడుక్కువస్తా పెద్దమ్మా!" అంటూనె పళ్ళపొడి ఎడమచేతిలో వేసుకుని, తాటాకుబద్ద తీసుకుని మల్లి పందిరివైపు నడిచింది మల్లి.

మల్లిపందిరిని పరిశీలించి చూసింది ఈరోజు నిన్నటికంటె మొగ్గలు చాలావస్తాయి అనుకోగానె ఆమెమనస్సుఆనందంతో నిండిపోయింది

అప్పుడు అందరికంటె ముందుగా మల్లిపందిరి దూసింది మల్లి. దానిచుట్టూ బోదెవేసింది. వారం దాటిన తరువాత నీరు పోయడం ప్రారంభించింది. పసిడిమొగ్గలతోపాటు పచ్చని చిగుళ్ళు పందిరినిండా వచ్చాయి. నీళ్లు బాగా పొయ్యడంవల్ల అందరి మొగ్గలకంటె మల్లి పందిరిమొగ్గలు పెద్దవిగా ఉన్నాయి. అందరి పందిరికంటె ఎక్కువ పూస్తున్నాయికూడా.

సంతృప్తిపడిన మల్లి పక్కనేఉన్న ముక్కాలి పీటమీద కూర్చుని పళ్లు తోముకోడం మొదలుపెట్టింది.

వాళ్ళపెద్దమ్మ ఇత్తడిచెంబుతో నీళ్లుపట్టుకొచ్చి పక్కనేపెట్టి 'త్వరగా రా' అంటూ మరోసారి హెచ్చరించి వెళ్ళిపోయింది.

చల్లని గాలికెరటంవచ్చి మల్లి ఒంటిని తాకి గిలిగింతలు పెట్టి వెళ్ళిపోయింది. ఎదురుగా జామిచెట్టుమీద కూర్చున్న చిలకల జంట మల్లిని పలకరిస్తున్నట్లుగా కిచకిచమన్నాయి. తలెత్తిచూసిన మల్లి నవ్వుకుంది. ఇంతలో మరో గాలికెరటం రాత్రిపూసిన మల్లె పూలను ముద్దుపెట్టుకుంటూ వచ్చింది. ఆ సువాసనకు ముక్కుపుటాలనిండా గాలి పీల్చుకుంది మల్లి. ఆ వాతావరణంలో ఆమె మనస్సు ఎటో పరుగులెత్తుతోంది.

చేతిలో మిగిలినపౌడరు కిందకు పోసేసి చెంబులో నీళ్ళు చేతిలోపోసి మొహం కడుక్కోడం మొదలుపెట్టింది. అంతలో 'కూ! కూ' కోయిల కూత వినబడింది.

ఉలిక్కిపడిన మల్లి తలెత్తిచూసింది ఎదురుగామామిడిచెట్టు కొమ్మలమధ్యలో కూర్చున్న కోయిల మరోసారి 'కూ! కూ' అంది.

మల్లి మనసులో కోటి వసంతాలు పూసాయి. చేతిలోఉన్న చెంబు అక్కడేపడేసి 'పెద్దమ్మా' అంటూ పరుగెత్తుకొచ్చింది.

"ఏమిటమ్మా!" ఆవిడ ఆశ్చర్యంగా అడిగింది.

"పెద్దమ్మా! అదిగో! కోయిల కూస్తోంది" అంటూ మామిడి చెట్టు కొమ్మల మధ్యలోఉన్న కోయిలవైపు చూసింది.

"కూ! కూ" కోయిలపాట వినబడుతోంది.

"ఏమిటమ్మా!" మళ్ళీ అడిగింది ఆవిడ.

"కోయిల కూసినరోజే బావ వస్తానన్నాడుకదా పెద్దమ్మా!" అమాటలు అంటున్న మల్లిబుగ్గలు కెంపులయ్యాయి.

మల్లిమొహంలోని కాంతిని ఆవిడ వింతగా చూస్తోంది. ఆ చూపులు తట్టుకోలేని మల్లి తలదించుకుంది.

"నిజమేనమ్మా! నేను మరిచేపోయాను. మీబావ ఈరోజు తప్పకుండా వచ్చేస్తాడు."

"పెద్దమ్మా! మరి ఆవూళ్లో కోయిల ఇప్పుడు కూసిందో లేదో!"

ఆమాటకు సమాధానం ఆవిడ వెంటనే చెప్పలేకపోయింది ఒకసారి ఆలోచించింది.

"కాలంరాగానె అన్ని వూళ్ళలో కోయిలలు ఒకేసారి కూస్తాయి. ఈపాటికి ఆవూళ్లో కొయిలకూడా కూసే ఉంటుంది" మనస్సులో ఆవిడకు సందేహంగా ఉన్నా మల్లికి సమాధాన మిచ్చింది.

"నిజమేనా పెద్దమ్మా!"

"నిజమే మల్లీ! కాఫీ చల్లారిపోతోంది" ఆవిడ వంగి గిన్నెలోకాఫీ గ్లాసులోపోసి "మల్లీ కాఫీ ఇదిగో" అంది.

మల్లి అక్కడలేదు. ఆవిడ ఆశ్చర్యంగా అటు ఇటు చూసింది మల్లెపందిరిచుట్టూ తిరుగుతూ మల్లెపూలను చేత్తో తాకుతూ పలకరిస్తున్న మల్లినే చూస్తూ నిలబడింది ఆవిడ.

అంతలో కోయిల మళ్ళీ "కూ! కూ!" అంటూ మల్లిని పలకరిస్తున్నట్లుగా కూసింది.

"వస్తాడె మాబావ" అంటూ కూనిరాగం తీస్తున్న మల్లి "కూ! కూ!" అంటూ కోయిలకు బదులు పలుకుతూ లోపలికి వచ్చింది. పంతానికి వచ్చిన కోయిల మరింత కూస్తోంది.

"మల్లీ! కాఫీ తాగవే" చల్లారిపోయిన కాఫీ తిరిగి గిన్నెలో పోసి కుంపటిమీద పెట్టింది.

"త్వరగా ఇచ్చేసెయ్యి పెద్దమ్మా!" అంటూ తొందర పెట్టింది మల్లి.

ఆవిడ తిరిగి గ్లాసులోపోసి అందించింది. మల్లి గబగబా ఊదుకుంటూ కాఫీతాగి కాఫీగ్లాసు ఆవిడకు అందించింది.

"పెద్దమ్మా! అత్తయ్యా వాళ్ళింటికి వెళ్ళిరానా!"

"అంతదూరం నువ్వెందుకమ్మా వెళ్ళడం. మీ బావ వస్తే ముందు నిన్ను చూడడానికే వస్తాడు. ఈ రోజు శుక్రవారమని మర్చిపోయాను. నీకు తలంటుతాను జడవిప్పుకో"

"దేవుని పూజకు పూలు కోసుకొచ్చి జడ విప్పుకుంటా" పూలసజ్జ తీసుకుని పూలమొక్కల దగ్గరకు వెళ్ళింది మల్లి.

జానకమ్మగారు లేచివెళ్ళి వేన్నీళ్ళు కాచడానికి ప్రయత్నం చేస్తోంది.

రాత్రి తెంపగా మిగిలిన మొగ్గలన్నీ విప్పి చెట్టునిండా కనబడుతున్నాయి మల్లెపూలు. వాటినన్నిటినీకోసి సజ్జ నింపింది. తర్వాత ఎర్రని మందారాలుకోసి వాటి మధ్యలో సద్దింది. పట్టుకొచ్చి ఆసజ్జ దేవునిదగ్గర పెట్టింది.

జానకమ్మ కుంకుళ్లతో తలరుద్ది స్నానం చేయించింది. తర్వాత సాంబ్రాణి పొగవేసి జుట్టు అరబెట్టింది. ఒదులుగా జడ అల్లి రిబ్బన్లు కట్టింది. రాత్రి కట్టిఉంచిన మల్లెపూలదండ తల్లో పొడవుగా పెట్టింది. మరోసారి అద్దం చూసుకున్న మల్లి వెళ్ళి వీధిలో నిలబడింది. ఎక్కడా వాళ్ళబావ సత్యంలాంటి మనిషి కూడా కనబడలేదు. ఎందుకో కాస్త చికాకు అనిపించి ఇంట్లోకి వెళ్ళాలని వెనుతిరిగింది.

అంతలో "మల్లీ! ఆగవే" అంటూ కోటి మెట్లెక్కాడు.

మల్లి వినిపించుకోకుండా గడపదాటి లోపలికి వచ్చింది.

"ఏంమల్లీ! వినిపించుకోవేం. నీక్కాదు చెబుతోంది. మీ పెద్దమ్మని ముహూర్తం పెట్టించమని చెప్పు"

కోటి పేరు చెబితేనె చికాకు మల్లికి. అతన్ని చూస్తేనే అసహ్యం ఆమెకు. ఎప్పుడూ కారాకిళ్ళీ నములుతూ తుబుకు తుబుకున ఉమ్ములు వేస్తూ వస్తాడు.

"చాల్లే ఇంక వెళ్ళు" అంది చికాగ్గా మల్లి.

"నిన్ను పెళ్ళిచేసుకోందే ఎలా వెడతానె. మీబావవస్తాడని ఎదురు చూస్తున్నావా! వాడు నిన్నెలా పెళ్ళి చేసుకుంటాడో నే చూస్తా! ఓరోజు నేనే ముహూర్తం పెట్టించుకొచ్చి తాళి కట్టేస్తానె. అప్పుడు ఎవడు అడ్డొస్తాడో నేచూస్తానె" అంటు మెట్లు దిగి వెళ్ళిపోయాడు.

అంతవరకు బింకంగా నిలబడ్డ మల్లి దిగజారిపోయింది. మల్లి కళ్ళలో నీళ్లు నిండిపోయాయి. ఆమాటలన్నీ లోపల వంట చేస్తున్న జానకమ్మకు వినబడుతూనె ఉన్నాయి. కోటి అంటేనే ఆవిడకు అసహ్యం. అందుకే ఆవిడ బయటకు రాలేదు.

మల్లి ఏడ్చుకుంటూ వెళ్ళి వంటచేస్తున్న జానకమ్మగారిమీద పడింది. అంతవరకు ఆపుకున్న దుఃఖం పైకి వచ్చింది మల్లికి. "చూసావా! పెద్దమ్మా! కోటి ఏమన్నాడో. నేను వాడిని చచ్చినా పెళ్లి చేసుకోను. వాడలా అంటుంటె నువ్వు ఎందుకు తిట్టలేదు? వాడు మీఅన్న కొడుకనేకదా!" కళ్లు నులుముకుంటు పేచీపెట్టింది మల్లి ఏడుస్తూనె.

"ఏడవకే! అయినా చిన్నపిల్లలా ఆ ఏడుపేమిటే? వాడు చేసుకుంటానంటే అయిపోతుందా పెళ్లి" ఆవిడ లేనినవ్వు తెచ్చుకుని కళ్లు నులుముకోకుండా మల్లి రెండుచేతులు పట్టుకుంది.

"పూర్వం పెళ్లికూతుళ్లు అయిదురోజుల పెళ్లిళ్ళలో భయపడి ఏడ్చి ఇదిగో నీలాగె మొహంనిండా కాటుక చేసుకునేవారు.

ఆవిడ మాటలకు నిజంగానె మల్లికి నవ్వువచ్చింది.

"మల్లీ! వెళ్లి మొహం కడుక్కునిరా! అన్నం తిందువుగాని" ఆవిడ మాట మార్చింది. మల్లి అటు వెళ్లింది. ఆవిడ మాట కాదనలేక.

మల్లి పుట్టగానె జబ్బుచేసింది తల్లికి. అప్పటికే భర్తపోయి పుట్టింట్లో ఉన్న జానకమ్మ చెల్లెలికి సాయంగానె వెళ్లింది. మల్లెపూలా తెల్లగా నాజూగ్గాఉన్న పిల్లను 'మల్లీ' అని పిలిచేది తల్లి. బారసాల నామకరణం లేకపోయినా మల్లిపేరు నిలిచిపోయింది.

పట్నంనుంచి చూడటానికి వచ్చిన బంధువులావిడ 'మల్లిక' అని పెట్టింది పేరు. అందరు మల్లిక పేరు చాలా బావుందనుకున్నారు కాని పిలిచేటప్పుడు అందరూ 'మల్లీ' అనే పిలుస్తారు. అయిదేళ్లు రాకుండానె మల్లిని అప్పగారికి అప్పజెప్పి కళ్లు మూసింది తల్లి. తండ్రి ఎటో వెళ్ళి మళ్ళీ ఇంటికి తిరిగి రాలేదు. అప్పటినుంచి మల్లిని కంటికి రెప్పలా కాపాడుతూ పెంచుతోంది ఆవిడ. దూరపు వరసకు మేనల్లుడు అవుతాడు కోటేశ్వరరావు. ఇంట్లో మగదిక్కు లేకపోవడంవల్ల కాస్త సహాయంగా ఉండేవాడు కోటేశ్వరరావు. అతన్ని అందరూ కోటిగాడనే పిలుస్తారు వయసు వచ్చినకొద్దీ అతనికి చెడుగుణాలన్నీ అలవాటయ్యాయి. దానితో జానకమ్మ గారు కాస్త దూరంగా ఉంటోంది. చిన్నప్పటి చనువువల్ల కోటి గాడికి మల్లిని పెళ్ళి చేసుకోవాలనే కోరిక కలిగింది. కాని మేనత్త కొడుకు సత్యం, మల్లి ఒకరి మనస్సులు ఒకరు ఇచ్చిపుచ్చు కున్నారు. సత్యం బుద్ధిమంతుడు. పైగా మల్లికి తగిన రూపు రేఖలు తెలివితేటలు అతనికి ఉన్నాయి. ఇంటర్ పాసయ్యాడు సత్యం. ఉద్యోగం కోసం పట్నము బయలుదేరే ముందు మల్లి దిగులుపడిపోయింది. అందుకే మల్లికి కోయల కూయగానే రెక్కలు కట్టుకు వాలతానని చెప్పి బయలుదేరి వెళ్ళాడు. అప్పటి నుంచి కోయల కోసం ఎదురు చూస్తోంది మల్లి. ఆ పిల్లను సత్యానికిచ్చి పెళ్ళి చెయ్యాలని జానకమ్మాకూడా ఆతురత పడు తోంది. అవన్నీ జ్ఞాపకం రాగానె ఆవిడ కళ్ళలో ఇందుపకాయి లంత నీళ్ళు నిలిచాయి.

"పెద్దమ్మా అన్నం పెట్టావా" అంటూ వస్తున్న మల్లి కంటబడకుండా కళ్ళు తుడుచుకుంది ఆవిడ.

ఇద్దరికీ భోజనాలు వడ్డించింది ఆవిడ. అన్నం తింటున్న మల్లి ధ్యాస ఎటో ఉంది. "కొంచెం పాయసం వెయ్యనా మల్లీ" అన్న పెద్దమ్మ మాటలకు ఈ లోకంలోకి వచ్చిన మల్లి "పాయసం ఎందుకు వండావు పెద్దమ్మా"! అంది, పాయసం గిన్నె ఖాళీగా ఉంది. కాని అది తిన్న గుర్తే లేదు మల్లికి.

"ఈ రోజు మీ బావ వస్తున్నాడు కదా"! అంటూ గిన్నెలో మరింత పోసింది.

"పాయసం చాలా బాగుంది" అంటూ తింది మల్లి.

అంతలో చింతగింజల బుట్ట పట్టుకుని వచ్చింది పక్కింటి సీత.

కంచంలోనె చెయ్యి కడుక్కొని లేచింది మల్లి. ఇద్దరు చింతగింజలు ఆడడం మొదలు పెట్టారు. మొదటి ఆటలో మల్లి నెగ్గింది. కాని రెండో ఆట మూడో ఆటలో ఓడిపోయింది. ఇంక ఆడనని లేచింది.

"సీతా, మల్లి మొగ్గలు కోసుకుందామె".

"ఈ రోజు ఎందుకమ్మా! ఇంత కంగారూ".

మల్లి చెప్పలేక పోయింది. ముసిముసి నవ్వులు నవ్వింది.

"నే చెబుతానె సీతా! ఈ రోజు వాళ్ళ బావ వస్తాడే" అంది. వాళ్ళ సంభాషణ వింటున్న జానకమ్మగారు.

"చెప్పవేమీ నంగనాచీ! నడు మొగ్గలు కోద్దాం" అంటూ ఇద్దరూ ఆ ఎండలో మొగ్గలు కోయడం మొదలు పెట్టారు. చేతులు నొప్పులు పుట్టాయి ఇద్దరికి. ఇంకా మొగ్గలున్నాయి పందిరికి.

"ఇంక వదిలేద్దామె పొద్దుటికి పూలు పూస్తాయి" అంది మల్లి.

"నీయిష్టం" అంది సీత.

ఇద్దరూ పమిట కొంగుల్లోని మొగ్గలు ఒక పళ్లెంలో పోసి నీళ్ళు జల్లారు. దారంతో మాలకట్టడం మొదలు పెట్టింది సీత. మల్లికి, జానకమ్మగారికీకూడా మాలకట్టడం చేతకాలేదు, సూది తీసుకుని పూలు గుచ్చాడం మొదలు పెట్టింది జానకమ్మగారు.

మల్లి వీధుల్లోకి వెళ్ళి ఒకసారి తొంగిచూసి వచ్చింది. ఎక్కడా సత్యం జాడ లేదు. లోపలకి వచ్చి బావి దగ్గరకు పరుగెత్తింది. నీళ్ళు తోడుకుని కట్టుకున్న బట్టలతోటి స్నానం చేసింది. ఆ తడిబట్టలతోటి లోపలకువెళ్ళి కర్ర బీరువా తెరిచింది. వెతికి వెతికి తనకు నచ్చిన లంగా, వోణీ జాకెట్టు తీసుకుని కట్టుకుంది. ఆతడి బట్టలు తీసి నూతి గట్టుమీద పడేసింది. అద్దం దువ్వెన్ని తెచ్చుకుని జానకమ్మగారి దగ్గర కూర్చొంది, ఆవిడ గుచ్చేపూలు ఆపుచేసి మల్లికి జడ వెయ్యడం మొదలు పెట్టింది.

"పెద్దమ్మా గారూ! మీరు నాతో ఓడిపోయారు. నేను చూడండి ఎంత మాలకట్టానో అంటూ బారెడు దండ కొలిచి చూపించింది.

"నీతో నాకు పందెమేమిటిలే సీతా, మా మల్లి పెళ్ళికి నువ్వే కట్టాలి మాలలు" అంది నవ్వుతూ.

"ఇంత దండా మల్లికి పెట్టాలండీ".

"అమ్మో; అంతా దండనా! అందరూ నన్ను చూసి నవ్వుతారె" అంది మల్లి.

"ఏం నవ్వారు, జడ పొడుగుతా కట్టించుకో పైకి పెట్టు కోడానికి ఒకరో దండ కడతాను" అంటూ సీత గబగబా మరో దండకట్టడం మొదలు పెట్టింది.

ఆ దండ తీసుకుని మల్లి జడ పొడుగుతా కట్టింది జానకమ్మ సీత అందించిన మరో చిన్న దండ పైన పెట్టింది. జడ కుచ్చులు మోకాళ్ళ వరకు వేళాడుతుంటే లేచింది మల్లి.

"ఈ రోజు మల్లికి దిష్టి తియ్యాలండీ" అంది సీత.

"మంచి మాట అన్నావు సీతా!" అంది ఆవిడ.

ఇద్దరూ ఇంకా మొగ్గలు గుచ్చుతూనె ఉన్నారు. కళ్ళ చుట్టూ కాటికా పెట్టుకున్న మల్లి మరోసారి అద్దం చూసుకుని వీధుల్లోకి వెళ్ళి నిలబడింది.

"మీ బావ వస్తున్నాడే మల్లీ" అంది ఎదురింటి తులసి".

అటు చూసిన మల్లి సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయింది. కోటి వసంతాలు ఎదురు వస్తున్నట్లు అనిపించింది.

"పెద్దమ్మా! బావ వస్తున్నాడు" లోపలికి పరిగెత్తింది.

"రా! రా! సత్యం అక్కడే నిలబడ్డావేం కూర్చో" అంటూ పక్కనే ఉన్న కర్రబల్ల చూపించింది.

"ఏం అత్తా బాగున్నావా"?

"బాగున్నా బాబూ! ఎప్పుడొచ్చావు".

"ఇప్పుడే వచ్చా! నిన్ను చూసి పోదామని వచ్చాను" అంటూనె మల్లి వైపు చూసాడు.

మల్లి శరీరం మొగ్గలా ముడుచుకు పోయింది. మొహం మాత్రం విప్పారి చంద్రబింబంలా వెలిగిపోతోంది సత్యం కంటికి అందాల బొమ్మలా కనబడింది.

"పట్నంనుంచి వచ్చావు. కాస్త కాఫీచుక్క తాగుతావా సత్యం"

"ఇప్పుడే భోజనంచేశా! ఇప్పుడేమీవద్దు అత్తా"

"పట్నంవెళ్ళి బాగా మారిపోయావు. అక్కడ ఏదో ఉద్యోగం దొరికిందటగా"

"అవునత్తా! ఒక మంచి కంపెనీలో దొరికింది. ఒకసారి అందరిని చూసిపోదామని వచ్చాను.

"చూసి వెళ్ళడంకాదు. పెళ్ళిచేసుకుని మరీ వెళ్ళాలి. తెలిసిందా"

"నీమాట ఎప్పుడు కాదన్నాను అత్తా"

"వచ్చేనెల ముహూర్తాలు ఉన్నాయిట. మీఅమ్మకు, నాయనకు కబురుచేసి మాట్లాడతాను. నాకా పెద్దతనం వచ్చేసింది. ఆరోగ్యం అంతంత మాత్రంగాఉంది. నా చెల్లి కన్నదన్నమాటే గాని ఓఅచ్చటా ముచ్చటా చూడలేదు. పసికందును నా చేతుల్లో పెట్టి కన్నుమూసింది. నేను నీ చేతుల్లో పెట్టి బాధ్యత తీర్చుకుంటాను బాబూ!" ఆవిడ కంఠం జీరబోయింది.

"బాధ్యతకేముంది అత్తయ్యా! అన్నీ పెద్దవాళ్ళతో మాట్లాడు".

మల్లి సిగ్గుతో అక్కడ నిలబడలేక తలుపుచాటున నిలబడి తొంగిచూస్తోంది.

మాలకట్టడం పూర్తిచేసిన సీత మల్లి పెళ్ళిసంగతి అందరితో చెప్పాలని ఆదండతోనె పరుగెత్తింది.

"కాఫీ పట్టుకొస్తాను బాబూ" అంది ఆవిడ.

మల్లితో ఒంటరిగా మాట్లాడాలనుకున్న సత్యంతలూపాడు. ఆవిడ అక్కడనుంచి వెళ్ళగానె "ఏం మాట్లాడవేం మల్లీ" అన్నాడు నవ్వుతూ.

"ఏంమాట్లాడాలి! ఇందాక కోయిలకూసింది నువ్వు వస్తావనుకున్నాను."

"వసంతమంతా నాదేనంటూ కూస్తుంది కోయిల. వచ్చేసాగా".

"చెరువుగట్టుకురా! నేను అటే వెడుతున్నా" సమాధానంగా తలూపింది.

కిందటిసారి వెళ్ళిననాడు చెరువుగట్టున సత్యం మల్లిని దగ్గరకు తీసుకున్నసంగతి గుర్తుకువచ్చి తనఒళ్ళు జలదరించింది. ఇద్దరి మనస్సులు తిరిగి తొందరపడ్డాయి.

జానకమ్మగారు గ్లాసులోపోసి కాఫీ అందించింది సత్యానికి.

అతను గ్లాసు అందుకుని తాగడం మొదలుపెట్టాడు.

"ఈమల్లిసికాపాడ్డమే కష్టంగాఉందిబాబూ"

"అదేమిటత్తా అలా అంటావు?"

"అవును బాబూ. ఒకనాడు మలి బింది తీసుకుని చెరువుకి వెళ్ళింది. వెనుకనుంచే వెళ్ళి చెయ్యి పట్టుకున్నాడు ఆ కోటిగాడు. పిల్ల విడిపించుకోలేకపోయింది. ఎన్నితట్టినా వాడికి లెక్కలేదు.

ఇంతలో తోట రామన్న వస్తుంటే చూసి పారిపోయాడు. అప్పటి నుంచి పిల్లను చెరువుకే పంపడంలేదు."

"అంతపని చేసాడా!" కోపంతో ఊగిపోతూ కుర్చీలోంచి లేచాడు సత్యం.

"దుష్టుడు వాడుబాబూ! అతనితో పగ అంతమంచిదికాదు మన జాగ్రత్తలో మనం ఉండడం మంచిది".

తిరిగి కుర్చీలో కూర్చుంటూ "ఇంక వస్తాను అత్తా" అంటూ తిరిగి లేచాడు.

"పెళ్ళిసంగతి మీఅమ్మతో మాట్లాడుతా బాబూ" అంది ఆవిడ

"సరే" అంటూనె మల్లివైపు తిరిగి సంజ్ఞచేశాడు.

మల్లి తిరిగి సమాధానమిచ్చింది.

ఆ ఇద్దరిని చూసి నవ్వుకుంది ఆవిడ.

సత్యం చెరువుగట్టువైపు నడిచాడు. బిందెతీసుకుని బయలు దేరింది మల్లి

"ఎక్కడికే మల్లీ" జానకమ్మ భయంగా అడిగింది.

"బావ ఉన్నాడుగా పెద్దమ్మా! భయమెందుకు. నువ్వు అత్తయ్యా వాళ్ళింటికివెళ్ళి అన్ని సంగతులు మాట్లాడి నేను వచ్చే టప్పటికి ఇట్లో ఉండాలి" అంటూ లేడిలా గెంతుకుంటూ పరు గెత్తింది మల్లి ఇంటికి తాళంపెట్టి జానకమ్మ ఆడబిడ్డ ఇంటికి బయలుదేరింది.

దూరంనుంచి సత్యం కనబడుతున్నాడు. మల్లి మరింత వేగంగా నడిచింది. సత్యం చెరువుగట్టుఎక్కి తిరిగి చూసాడు. దూరంలో మల్లి కనబడిలది. చెయ్యి ఊపాడు. తిరిగి చెయ్యి ఊపింది మల్లి.

సంతోషంతో చెరువులోకి దుమికాడు సత్యం. మల్లి మరింత సంతోషంగా ముందుకు నడిచింది. వెనకనుంచి వచ్చిన కోటి ఒకచేత్తో ఆమె నోరునొక్కి పట్టుకుని మరోచేత్తో ఆమెను దగ్గరకు లాక్కున్నాడు. విడిపించుకోవాలని మల్లి చేసిన ప్రయత్నం విఫలమయింది. చేతిలో ఉన్న బిందె జారి దూరంగా దొర్లింది. "పెళ్ళికి ముహూర్తం ఇప్పుడే పెట్టించుకొచ్చానె" అంటూ మామిడితోటలోకి లాక్కుపోయాడు మల్లిని.

ఎప్పటికిరాని మల్లిమీద సత్యానికి చిరుకోపం వచ్చింది. ఆమెను ఏవిధంగా ఏడిపించాలా అని ఆలోచిస్తూ గట్టుమీదకువచ్చి చూశాడు. కనుచూపుమేరలో ఎక్కడా మల్లి కనబడలేదు. "మల్లీ! మల్లీ!" అంటు పిలిచాడు. దూరంనుంచి ప్రతిధ్వని వినబడిందే తప్ప మల్లిజాడలేదు. అతనికి ఆశ్చర్యం వేసింది. అంతవరకు వచ్చిన మల్లి ఏమయిందో అతనికి అర్థంకాలేదు. ఏదో అనుమానం కలిగింది అతనిలో. మరింత పరిశీలించి చూశాడు. దూరంగా నీరెండలో మిలమిలా మెరుస్తూ ఇత్తడిబిందె కనబడింది. ఈసారి అనుమానం మరింత దృఢమయింది.

"మల్లీ" అంటు వేగంగా గట్టుదిగాడు. మామిడితోటలో నుంచి 'బావా' అంటు పిలిచినట్లయింది. అటు పరుగెత్తాడుసత్యం. అప్పటికే సంధ్యాసమయ మవుతోంది. మామిడితోటలో చీకటిగా అనిపిస్తోంది. ఏదో ఆకారం కదులుతూన్నట్లు కనబడిందిసత్యానికి.

"ఒరే కోటీ" అంటూ పట్టరాని కోపంతో అటువరుగెత్తాడు సత్యం. నేలమీద గిలగిలా తన్నుకుంటున్న మల్లి. ఆమెను రెండు చేతులతో, రెండుకాళ్ళతో అదిమిపట్టి వాటేసుకోబోతున్న కోటి స్పష్టంగా కనబడ్డారు. సింహంలా దుమికాడు కోటిమీదికి. "ఒరే కోటి నీ ప్రాణం ఈరోజుతోసరి" అంటూనె అతన్ని బలంగాగుంజి ఎత్తిపట్టి ఈదవడ అదవడ వాయించాడు. నేలకేసి తొక్కాడు. తాగితాగి అరిపోయిఉన్న కోటి సత్యం బలంముందు ఆగలేక పోయాడు. నోటికి వచ్చినట్లు బూతులు తిడుతూనె సత్యంమీదికి పగబట్టిన త్రాచులా ఎగబడుతున్నాడు కోటి. మల్లిలేచి చీర సద్దు కుని ఒణికిపోతోంది. కాని నోటమ్మట మాటలేదు. కాస్తతేరుకున్న మల్లి "బావా! వదిలేసెయ్యి" అంటూ సత్యాన్ని వదిలించ బోయింది. కాని అతను మల్లీ! నువ్వు దూరంగా జరుగు'అంటూ ఒక తోపు తోశాడు. మల్లి వెళ్ళి అంత దూరంలో పడింది.

అంతలో జనం పోగయ్యారు. ఎంతవారించిన సత్యాన్ని ఆపలేకపోతున్నారు. అతనిలో ఆవేశం పెరిగింది. వివేకం అడుగున పడిపోయింది. నేల మీద సొమ్మసిల్లి పడిన కోటిని పొట్ట మీద ఒక తన్ను తన్నాడు. నోటమ్మట రక్తం కక్కుతున్న కోటి తల పక్కకు పడిపోయింది, దోషిలా లబడ్డాడు సత్యం. ఆ సమయంలో పోలీసులను వెంటపెట్టుకుని వచ్చారు ఎవరో. రెండు చేతులకు బేడీలు తగిలించారు సత్యానికి.

చూడలేని మల్లి కళ్ళు తిరిగి పడిపోయింది. అక్కడ ఉన్నవారు ఎవరో మల్లిని ఇంటికి తీసుకువచ్చి వీధి అరుగు మీదకు చేర్చారు. మెల్లిగా కోలుకున్న మల్లి లేచి కూర్చుంది. పరిస్థితి అర్థం చేసుకుంది.

ఆ వార్త తెలిసిన జానకమ్మ పరుగు పరుగున వచ్చింది, మల్లిని చూసి బావురుమంది. మల్లి నిర్వికారంగా అలాగె కూర్చుండిపోయింది. జీపు చప్పుడైతే తలెత్తి చూసింది. పెళ్ళికి బాండు మేళంతో ఊరేగుతూ ఇంటిముందుకు రావలసిన సత్యం చేతికి బేడీలతో పోలీసు జీపుతో వెడుతున్నాడు. వంచిన తల ఎత్తి మల్లిని చూడలేకపోయాడు.

"ఇదంతా నా మూలంగా జరిగింది బావా : నువ్వు జైలు పాలు అయిపోయావు బావా'' అంటు ఘొల్లుమంది మల్లి. ఏడే మల్లిని చూడలేకపోయాడు సత్యం. కారే కన్నీళ్ళు మల్లి కంట కనబడకుండా తల పక్కకు తిప్పుకున్నాడు. జీపు కదిలింది. మల్లి జడలోని మల్లెమొగ్గలు విప్పుకుని గుపుమంటున్నాయి. దూరంగా కోయిల కుస్తోంది. అవేమి పట్టించుకునే స్థితిలో లేదు మల్లి ఏడ్చి ఏడ్చి అలసిపోయిన మల్లిక నేలమీదకు వరిగి పోయింది. మల్లికి అందని వసంతం దూరంనుంచే కదులుతూ వెళ్ళిపోయింది.